
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
సోమవారం 12 మే 2025 పేజీలు 8





## వైభవంగా అమ్మవారి తిరునాళ్ల



వివరాలు 4లో

నేడు కలెక్టరేట్‌లో...

## మాక్ డ్రిల్

అగ్ని ప్రమాదాలు నుండి రక్షణ.. విపత్తు సమయంలో ఎలా స్పందించాలి?

ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

మిగతా 2లో



**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, మే 11, మేజర్ న్యూస్ :** ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు సంభవిస్తే మనల్ని మనం ఎలా కాపాడుకోవాలి? అగ్ని కీలల్లో, ఉక్కిరిబిక్కిరి చేసే పొగల్లో ఎవరైనా చిక్కుకుంటే ఎలా కాపాడాలి? భూకంపాలు, ఎడతెరపి లేకుండా కురిసే భారీ వర్షాలు సమయాల్లో భవనాలు కూలితే ఏమిచేయాలి? ఇలా వివిధ విపత్తుల సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే విలువైన ప్రాణాలను కాపాడవచ్చుని.. ఈ నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 12న కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 8.30గంటల నుంచి

## నేడు ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ

7లో

## నేడు తిరువూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

2లో..

తిరువూరు డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టరేట్‌లోనూ అర్జీలు సమర్పించేందుకు ఏర్పాట్లు

ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



## బుద్ధ జయంతికి ఘంటసాల ముస్తాబు

6

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



వివరాలు 3లో

## 14న గుడివాడ ఏఎన్నార్ కళాశాలలో జాబ్ మేళా





యువత సద్వినియోగం చేసుకోవాలన్న ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, గుడివాడ ఎంఎల్ఏ వెనిగండ్ల రాము

వివరాలు 5లో...

## నేడే ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీ కోసం : జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ

3లో

(మొదటిపేజీ తరువాయి)

## నేడు కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్

9 గంటల వరకు మాక్ డ్రిల్ నిర్వహించడం జరుగుతుందని.. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, రవాణా తదితర శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటారని, నగర ప్రజలు కూడా కార్యక్రమాన్ని తిలకించి అవగాహన కల్పించుకోవాలని కలెక్టర్ కోరారు. విపత్తు నిర్వహణలో భాగంగా అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలి? అనే దానిపై అవగాహన కల్పించడం ముఖ్యమని, సన్నద్ధత ప్రణాళికను సమీక్షించేందుకు ఇలాంటి మాక్ డ్రిల్స్ దోహదం చేస్తాయని కలెక్టర్ లక్ష్మీశ ప్రకటనలో తెలిపారు.

## నేడు తిరువూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**తిరువూరు డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**కలెక్టరేట్‌లోనూ అర్జీలు సమర్పించేందుకు ఏర్పాట్లు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



ఈ నెల 12వ తేదీ సోమవారం తిరువూరు డివిజన్‌లోని మండలాలకు చెందిన ప్రజల సౌకర్యార్థం తిరువూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) జిల్లాస్థాయి కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యే ఈ కార్యక్రమాన్ని తిరువూరు డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని విజయవాడలోని జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాస్థాయిలో గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతోందని.. అయితే ఈసారి తిరువూరు డివిజన్ ప్రజల సౌకర్యార్థం తమకు సమీపం లోనే ప్రత్యేకంగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరువూరు బస్టాండ్ వెనుక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఉదయం 10 గంటల నుండి అర్జీల స్వీకరణ ప్రారంభమవుతుందన్నారు. తిరువూరు డివిజన్ తో పాటు మిగిలిన ప్రాంతాల ప్రజలు కూడా తిరువూరులో అర్జీలు సమర్పించవచ్చుని.. విజయవాడలోని జిల్లా కలెక్టరేట్‌లో కూడా అర్జీలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఎప్పటి మాదిరిగానే డివిజన్, మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు.

## ప్రధాని మోదీ ఎమర్జెన్సీ మీటింగ్.. ప్లాన్- బీ ఇదేనా..?

### ఈ రాత్రి పాక్ కు చుక్కలే..

**విజయవాడ, మేజర్ న్యూస్ :** భారత్– పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఎమర్జెన్సీ మీటింగ్ నిర్వహించారు. ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ఈ భేటీ జరిగింది. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, డిఫెన్స్ చీఫ్ అనిల్ చౌహాన్ తో పాటు త్రివిధ దళాల అధినేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. భారత్– పాకిస్థాన్ ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్– పాకిస్థాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా వెల్లడించిన కొద్ది సేపటికే పాకిస్థాన్ తన దొంగ బుద్ధిని ప్రదర్శించింది. కాశ్మీర్, నాగ్రోటా ప్రాంతాల్లో మళ్లీ దాడులకు పాల్పడింది. దీంతో ఈ విషయాన్ని ప్రధాని మోదీ సీరియస్ గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఈ భేటీ కీలకం కానుంది. పాకిస్థాన్ ను మరోసారి నిలువరించాలన్న దానిపై త్రివిధ దళాధిపతులతో ప్రధాని మోదీ చర్చిస్తున్నారు. పాకిస్థాన్ పై మరోసారి కీలక నిర్ణయం తీసుకునే దిశగా ఈ సమావేశం సాగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఎమర్జెన్సీ మీటింగ్ పై ఇప్పుడు యావత్ భారతావని ఆసక్తిగా ఎదురుచూస్తోంది. నమ్మించి మోసం చేసిన పాకిస్థాన్ కు మరోసారి దీటుగా సమాధానం చెప్పాలని నెటిజెన్లు డిమాండ్ చేస్తున్నారు. యుద్ధాన్ని కొనసాగించాలని అంటున్నారు. దీంతో ప్రధాని మోదీ భేటీ కీలకం కానుంది.

## శ్రీవారి ఆలయంలో ఘనంగా శ్రీ నృసింహ జయంతి

**విజయవాడ, మేజర్ న్యూస్ :** తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం నృసింహ జయంతి ఘనంగా జరిగింది. ప్రతి ఏటా వైశాఖ మాసంలో ఈ ఉత్సవం నిర్వహిస్తారు. శ్రీ యోగనరసింహస్వామివారి మూల మూర్తికి ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకం చేశారు. శ్రీవారి ఆలయ మొదటి ప్రాకారంలో గర్భాలయానికి ఈశాన్యం వైపున గల మండపంలో పడమరగా శ్రీ యోగ నరసింహస్వామివారి ఉప ఆలయం ఉంది. యోగ ముద్రలో ఉన్న ఈ విగ్రహాన్ని శాస్త్ర ప్రకారం రూపొందించారు. స్వామివారికి నాలుగు చేతులుంటాయి. పైభాగంలో ఉన్న చేతులలో శంఖుచక్రాలు కనిపిస్తాయి. కింది రెండు చేతులు ధ్యాననిష్టను సూచిస్తాయి. క్రీ.శ 1330 నుంచి క్రీ.శ 1360 మధ్య కాలంలో నిర్మితమైన ఈ ఆలయంలో శ్రీ రామానుజాచార్యుల వారు శ్రీ యోగ నరసింహస్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడి స్వామివారు సగభాగం మానవ రూపంలోనూ, మరో సగభాగం శ్రీవారి అవతారమైన సింహం రూపంలోనూ ఉంటారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీటీ కోసం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమౌదాం




**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆర్టీటీ అడ్డంకులు తొలగిపోవాలంటే ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని మాజీ మంత్రి సాకే శైలజా నాథ్ అన్నారు. ఆర్టీటీకి విదేశాల నుండి వస్తున్న నిధులను ఆపడాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు అఖిలపక్ష కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అంజి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ మాట్లాడుతూ.. ఆర్టీటీ గొప్ప లక్ష్యంతో ఏర్పడిందని సేవా, సహాయ దృక్పథంలో అనేకమంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. ముఖ్యంగా విద్యా, వైద్యానికి పెద్దపీట వేస్తూ పేదలను ఆదుకోవడంలో గొప్పగా కృషిచేసిన ఆర్టీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. లికేంద్ర ప్రభుత్వం విదేశీ నిధులను ఆపకుండా ఆపకుండా చూడాలని ఎఫ్ సి ఆర్ ఏ వెంటనే రెన్యువల్ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా ఏర్పడితే పట్టణ,నగర ప్రాంతాల్లో కూడా తీసిపోకుండా అభివృద్ధి పరచడం గొప్ప విషయమన్నారు.

# అధికార లాంఛనాల మధ్య మురళీనాయక్ అంత్యక్రియలు పూర్తి

**అమర వీరుని తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**పార్థీవదేహాన్ని స్వయంగా మోసిన మంత్రి లోకేష్, దగ్గరుండి ఏర్పాట్లు పరిశీలన**

**వీరజవాన్ మురళీ నాయక్ అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి సత్యప్రసాద్, సవిత, అనిత, సత్య కుమార్ యాదవ్**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆపరేషన్ సిందూర్ లో భాగంగా దేశం కోసం ప్రాణాలర్పించిన శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియల్లో ఆదివారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మరియు రాష్ట్ర మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. కళ్లితండాలోని నివాసం వద్ద మురళీ నాయక్ భౌతికకాయాన్ని సందర్శించి అశ్రు నివాళులు అర్పించారు. మురళీనాయక్ పార్థీవదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి సెల్యూట్ చేశారు. అనంతరం అగ్నివీర్ మురళీనాయక్ తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని డిప్యూటీ సీఎం, ఐటి శాఖ మంత్రి వారిని ఓదార్చారు. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో



మాట్లాడుతూ కుటుంబానికి అండగా ఉంటాం క్యాబినెట్లో చర్చించి మురళీనాయక్ కుటుంబానికి ఐదెకరాల పొలంతో పాటు మరో 300 గజాల ఇంటి స్థలాన్ని అందిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. మురళీనాయక్ పార్థివదేహానికి నివాళులర్పించడానికి కళ్లితండాకు వచ్చిన పవన్ మురళీనాయక్ కుటుంబానికి రూ.25 లక్షల వ్యక్తిగత సాయం చేస్తానని హామీ ఇచ్చారు. మురళీ కుటుంబానికి ఎలాంటి సాయం కావాలన్నా తమ మూడు పార్టీలు సిద్ధంగా ఉంటాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. మురళీనాయక్ కుటుంబానికి భగవంతుడు ధైర్యం ఇవ్వాలని కోరుకుంటున్నానని పవన్ ఆకాంక్షించారు.మురళీనాయక్ కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం తరపున అందిస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్?, మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. అనంతరం ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో మురళీనాయక్ స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. అంతేకాకుండా మురళీనాయక్ తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించినట్లు లోకేశ్ అన్నారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు కళ్లితండాను మురళీనాయక్ తండాగా మారుస్తామని లోకేశ్ పేర్కొన్నారు. చిన్న వయసులో మురళీనాయక్ మృతి బాధాకరమని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశా రు.స్వగ్రామంలో వీరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియలు పూర్తి అంతకు మునుపు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మురళీ నాయక్ స్నేహితులు, బంధువులను పరామర్శించారు. యుద్ధానికి ముందు వీరజవాన్ మురళీ నాయ క్ బంధువు, స్నేహితుడు రాజశేఖర్ తో జరిపిన వాట్సాప్ చాట్ ను మంత్రి పరిశీలించారు. మురళీనాయక్ జ్ఞాపకాలను ఈ సందర్భంగా బంధువులు పంచుకున్నారు. వీరజవాన్ మురళీ నాయక్ కు జై, భారత్ మాతాకి జై, వందేమాతరం అంటూ ప్రజలు, స్థానికులు పెద్దఎత్తున నినాదాలు చేశారు.

**వీరజవాన్ మురళీ నాయక్ పార్థీవదేహాన్ని మోసిన మంత్రి లోకేష్**



వీరజవాన్ మురళీ నాయక్ అంతిమ యాత్రలో పాల్గొన్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. మురళీ నాయక్ పార్థీవదేహాన్ని స్వయంగా మోసారు. ప్రభుత్వ అధికారిక లాంఛనాల మధ్య మురళీ నాయక్ వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలను పూర్తిచేశారు. అంతకుముందు ఉదయం నుంచి వీరజవాన్ మురళీ నాయక్ అంత్యక్రియల ఏర్పాట్లను మంత్రి లోకేష్ దుగ్గరుండి పర్యవేక్షించారు. అధికారులతో మాట్లాడి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పుట్టపర్తి పల్లె సింధూరారెడ్డి, మడకశిర ఎంఎస్ రాజు, కదిరి కందికుంట వెంకటప్రసాద్, తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్ పర్సన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పి విరత్న, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





## మదర్స్ డే సందర్భంగా
## తల్లిని కోల్పోయిన ఓ కూతురు గుండెచప్పుడు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రషీదా బేగం షేక్ కువైట్‌లో ఉంటున్నారు. ఎంతో అపురూపంగా చూసుకుంటున్న ఆమె తల్లి మాగ్బుల్ జాక్ వారం రోజుల క్రితం తిరుపతి జిల్లా గూడూరులో గుండెపోటుతో చనిపోయారు. హుటాహుటిన రషీదా బేగం ఇండియా వచ్చి తల్లి అంత్యక్రియలలో స్వయంగా పాల్గొని అన్ని తానే అయి చేశారు. ఈ సందర్భంగా ఆమె తల్లిని గురించి ఇలా అన్నారు.. నాకు ఇప్పుడే అర్థం అయింది ‘ తల్లి’ అంటే ఏమిటో. ఆరు రోజుల క్రితం నా తల్లి మాగ్బుల్ జాక్ ఈ లోకాన్ని విడిచిపోయారు. ఆమె ఇక ఫోన్ చేయరు. నా పేరు పిలవదు. నాకోసం కన్నీరు కార్చదు. అయినా ఆమె నా హృదయంలో పదిలంగా ఉంటుంది. ఎందుకంటే తల్లి ఎప్పుడూ దూరం కాదు. తల్లి మన ఊపిరిలో జీవిస్తూనే ఉంటుంది. నేను విదేశంలో ఉంటూ ఈ ప్రేమను వ్యక్తం చేయలేకపోయాను. ప్రపంచం నిండా ఉన్న, నేను ఇప్పుడు ఒంటరిగా ఉన్నాను. అప్పుడే అర్థమైంది తల్లి ప్రేమకు ప్రత్యామ్నాయం లేదని. తల్లిని ప్రేమించండి. ఆమె పక్కన ఉన్నప్పుడు చేతిని ప్రేమగా పట్టుకోండి.ఆమె హృదయాన్ని వినండి.ఆమె లేకుండా మీరు అమ్మ అని పిలవాలంటే ఆకాశం వైపు చూస్తూ కన్నీరు కార్చవలసిందే. తల్లి దేవత. మాతృ దినోత్సవం సందర్భంగా ప్రతి తల్లికి మన ప్రేమను గౌరవాన్ని చూపిద్దాం. ఇదే ఆమెకు అర్పించే నిజమైన ఘన నివాళి.

## ముగిసిన మేరుగ వారి దేవరమ్మ తల్లి సంబరాలు



**పమిడిముక్కల మే 11 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మంటాడ గ్రామంలో గత మూడు రోజులగా జరుగుతున్న మేరుగ వారి దేవరమ్మ తల్లి కొలువు సంబరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారికి పాల వెల్లి కట్టి, ముగ్గు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాలపొంగళ్ళు, ఆడపడుచుల మంగళహారతుల కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల అనంతరం భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాలలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## తల్లి ప్రేమ వెలకట్టలేనిది
### గ్రంథాలయ అధికారిణి లక్ష్మి



**పెదపారుపూడి మే 11 మేజర్ న్యూస్ :** తల్లి ప్రేమ వెలకట్టలేనిదని పెదపారుపూడి శాఖా గ్రంథాలయ అధికారిణి ఎం.వి.ఎస్.లక్ష్మి పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులలో భాగంగా ఆదివారం మాతృ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృ దినోత్సవ ప్రాముఖ్యత గురించి ఆమె వివరించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు చెస్, క్యారమ్స్ ఆటల పోటీలు నిర్వహించారు. అలాగే విద్యార్థులకు “పుస్తక పఠనం – ఆవశ్యకత” అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల చే తమకిష్టమైన పుస్తకాన్ని చదివించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణించడానికి మొదటి మెట్టు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవడమేనని, పుస్తకాలు చదువుతున్న కొద్దీ భాషపై పట్టు, విషయ పరిజ్ఞానం, అవగాహన సామర్థ్యం, ఊహాశక్తి, సమస్య పరిష్కార సాధన వంటివి అలవడతాయని, తద్వారా విద్యాభివృద్ధికి ఇవి ఎంతగానో ఉపయోగపడుతూ, విద్యార్థులు ఉన్నతమైన విద్యాప్రమాణాలు సాధించగలరని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాతృ దినోత్సవ శుభాకాంక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పేద కార్యకర్తలకు జీవనాధారంగా బడ్డీ సహాయం



**పమిడిముక్కల మే 11 మేజర్ న్యూస్:** పామర్రు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు కైలేఅనిల్ కుమార్ ఎల్లప్పుడూ కార్యకర్తల పట్ల అండగా నిలుస్తారని, ప్రత్యేకించి కష్టకాలంలో వారు చూపిన సహాయ సహకారాలు అభినందనీయమని రెడ్డిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కంభపు రాంబాబు పేర్కొన్నారు. పమిడిముక్కల మండల పరిధిలోని మంటాడ శివారు రెడ్డిపాలెం ఇందిరమ్మ కాలనీ ప్రధాన రహదారిపై ఓ పేద కుటుంబానికి చెందిన కార్యకర్త కైలే అనిల్ కుమార్ సహకారంతో ఏర్పాటు చేసుకున్న నూతన దుకాణాన్ని రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనిల్ కుమార్ పేద కార్యకర్తలకు తమకంటూ స్వంతంగా జీవనం సాగించేందుకు బడ్డీ రూపంలో నిధులు అందజేయడం, వారు ఉపాధిని పొందేలా చేయడం నూతన ఆశ కలిగించిందన్నారు. ఈ ప్రయత్నం ద్వారా కార్యకర్తలు ఆర్థికంగా స్వయం పరిపుష్టి సాధ్యంచగలుగుతారని, కుటుంబాలకు మంచి ఆదాయ వనరులు లభిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి కార్యాచరణలు ఇతర నేతలకు ఆదర్శంగా నిలుస్తాయని, కార్యకర్తల పట్ల ఉన్న బాధ్యతను తెలియజేస్తాయని రాంబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కంభపు లక్ష్మయ్య, కాగితాల కనకారావు, నీలాపు కనకారెడ్డి, చల్లా లక్ష్మణ్ రెడ్డి  పాల్గొన్నారు.



## ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలి

**బంటుమిల్లి మేజర్ న్యూస్:** పెడన నియోజకవర్గం పాశ్చాపురం గ్రామంలో ఆదివారం సువర్చలా సమేత ఆంజనేయ స్వామి గుడి వద్ద భారత ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సైనికులు సురక్షితంగా ఉండాలని భారతదేశం సురక్షితంగా ఉండాలని భారత దేశ సమగ్రత కోసం విజయం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న భారత ప్రధాని ఆయురారోగ్యాలతో ఉండాలని సరిహద్దు గ్రామాల ప్రజలు సురక్షితంగా ఉండాలని సువర్చలా సమేత ఆంజనేయ స్వామి గుడి వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రసాద వితరణ చేశారు. స్వామివారిని ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని దేశ సైనికుల దేశ విజయం సరిహద్దు గ్రామాల ప్రజల రక్షణ కోసం ప్రార్థించటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పార్టీలకు అతీతంగా ప్రజల మద్దతుతో స్వామి వారి ఆశీస్సులతో విజయవంతంగా నిర్వహించారు.

## నేడు లంకమ్మతల్లి నెల సంబరం



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : దివిసీమకు కొంగు బంగారమై కోరిన కోరికలు తీర్చే కలపవల్లిగా విరాజుల్లుతున్న అవనిగడ్డ గ్రామ దేవత లంకమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం లంకమ్మ తల్లీ నెల సంబరం కావడంతో ఆదివారం మొక్కు లు తీర్చుకునే వారితో ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. ఘటం బిందెలు, మేకపోతులు మొక్కులు ఉన్నవారు డప్పు వాయిద్యాలతో కోలాహాలంగా అమ్మవారి ఆలయం చుట్టూ తిరుగుతూ మొక్కుబడులను తీర్చుకున్నారు. ఈ నెల 12న జరిగే జాతర లో అమ్మవారికి మొక్కుబడును చెల్లించుకుని కానుకలను హుండీలో వేయాలన ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాస్ కోరారు.

## ఘనంగా అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ప్రారంభం



**నందిగామ, మే 11, మేజర్ న్యూస్ :** మండలంలోని లింగాల పాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మి పేరంటాల అమ్మవారి తిరణాల మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో నారాయణ నరసింహామూర్తి ఆలయ వంశపార్యం పర్య ధర్మకర్త చిరుమామిళ్ల వెంకటలక్ష్మి సాయిబాబు పర్యవేక్షణలో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి, ఆలయ అర్చక స్వాములు లక్ష్మీ పేరంటాలమ్మ వారి మూలమంత్ర హోమాది క్రతువులు, దీక్షాదారుల ఇరుముడి సమర్పణ పూజలు జరిగాయి, తిరుపతి ఆర్ జె సి చంద్రశేఖర్ ఆజాద్ లక్ష్మీ పేరంటాల అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆయనకు ఆలయ అధికారులు అమ్మవారి శేష వస్త్రం మెమొంటోని అందజేశారు. ఆలయ ధర్మకర్త చిరుమామిళ్ల వెంకటలక్ష్మి సాయిబాబు ఇంటి వద్ద నుండి మేళతాళాలు మంగళ వాయిద్యాలు నడుమ అమ్మవారికి పసుపు కుంకుమ పట్టు వస్త్రాలు సమర్పించారు. రాత్రి పూలతో అలంకరించిన ప్రధముపై శ్రీ లక్ష్మి పేరంటాల అమ్మవారి తిరునాళ్ల మేళతాళాలు మంగళ వాయిద్యాలు అమ్మవారి నమస్కారాలు నడుమ గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు రథోత్సవం కన్నుల పండుగ జరిగింది.



# బిగ్ టివి, స్వర కె యం ఆర్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం







**కంచికచర్ల మే 11 మేజర్ న్యూస్ :** గొట్టుముక్కల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం బిగ్ టీవీ, స్వర కెయంఆర్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ,షుగర్, గుండె, నరాలు తదితర వైద్యాలకు సంబంధించి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఈ ఉచిత వైద్య శిబిరంలో150 మంది వివిధ రకాల అనారోగ్యాలకి సంబంధించిన బాధితులకు సేవలందించారు. వైద్యులు అరవింద సూర్య కిరణ్ భాష, ఈశ్వర ఆదిత్య, జి. అనూష, స్వరాజ్యం వీరమాచినేని రోగులను పరీక్షించారు. పరీక్షలు జరుపుకున్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జగదీష్, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రపంచ శాంతిని నెలకొల్పటమే దివ్యజ్ఞాన సమాజం ముఖ్య ఉద్దేశం



## జాతీయ ఉపన్యాసకులు సవరం వెంకటేశ్వరరావు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రపంచ శాంతిని నెలకొల్పటమే దివ్యజ్ఞాన సమాజం యొక్క ప్రధాన ఉద్దేశం అని దివ్యజ్ఞాన సమాజం జాతీయ ఉపన్యాసకులు సవరం వెంకటేశ్వరరావు అన్నారు. 139 సంవత్సరాలు గా శాంతి స్థాపనలో కృషి చేస్తున్న దివ్యజ్ఞాన సమాజం వంటి ఉన్నత విలువలు కలిగిన సంస్థ మచిలీపట్నంలో ఉండటం నగరానికి ఎంతో కీర్తి అని సవరం అన్నారు. ఆదివారం ఆల్కట్ దివ్య జ్ఞాన సమాజం నూతన కార్యాలయం మచిలీపట్నం ఈడేపల్లి 46 డివిజన్లో ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు గొర్రెపాటి గోపీచంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభకు అధ్యక్షత వహించిన మచిలీపట్నం ఆల్కట్ దివ్యజ్ఞాన సమాజం అధ్యక్షులు న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ నేటి సమాజంలో మంచి ఆలోచనతో కూడిన నైతిక విలువలను యువతరానికి అందించవలసిన అవసరం అందరిపై ఉందని అన్నారు. గత 139 సంవత్సరాలుగా ఎందరో మేధావులు వారి త్యాగ ఫలంతో మచిలీపట్నం లో దివ్యజ్ఞాన సమాజం నిర్మించడం జరిగిందని నేటి పరిస్థితుల దృష్ట్యా నూతన కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలియజేశారు. జాతీయస్థా యిలో మచిలీపట్నం శాఖకు మంచి గుర్తింపు ఉందని బాలాజీ తెలియజేశారు. సీనియర్ ఆడిటర్ శేషాచార్యులు అప్పాజీ సహకారంతో మచిలీపట్నం శాఖ ఎంతో ఎదిగిందని అన్నారు. కరీంశెట్టి కైలాసపతి కార్యదర్శిగా సంస్థకు అందించిన సేవలు మరువలేని అని అన్నారు. ముఖ్య అతిథి బండి రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం కృషి చేయవలసిన బాధ్యత రాజకీయాలకు అతీతంగా అందరిపై ఉందని శాంతి లేని సమాజం ఉగ్రవాదానికి పునాది అని అన్నారు. మరో ముఖ్య అతిథి గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి యోగ, ప్రాణాయామం వంటి ప్రక్రియలను అలవాటు చేసుకోవాలని మన శరీరంలోని చెడు అలవాటులను వదిలి మంచిని పెంచుకోవాలని దివ్యజ్ఞాన సమాజంలో ప్రతి ఒక్కరూ సభ్యులు కావాలని అన్నారు. సంస్థ కార్యదర్శి కొత్త గుండు రమేష్ మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరంలో తమ సంస్థ యొక్క కార్యక్రమాలు ప్రతి పాఠశాల కళాశాలలో విస్తృతంగా నిర్వహిస్తామని తెలియజేశారు.ఏ విధమైన రుసుము లేకుండా ఉచితంగా సభ్యులుగా చేరవచ్చని ప్రపంచ శాంతి మంచిని పంచడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. మచిలీపట్నం దివ్యజ్ఞాన సమాజం ప్రచురించిన కరపత్రాలను 45వ డివిజన్ ఇన్చార్జ్ పి.వి ఫణి కుమార్,46వ డివిజన్ ఇన్చార్జ్ గండికోట అంజిబాబు ఆవిష్కరించారు.45వ డివిజన్ సచివాలయం సిబ్బంది బండి, గొర్రెపాటి, లంకిశెట్టిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సభ్యులు కారుమూరి రాజేంద్రప్రసాద్, గుడిసేవ మురళీధర్, కోశాధికారి కే. సత్యనారాయణ, న్యాయవాది కొత్త గుండు భాగ్యరాజ్, కృష్ణాజిల్లా పర్మనెంట్ లోకాదాలత్ సభ్యులు వేము కోటేశ్వరరావు, మల్లంపల్లి రామాంజనేయులు బాబు తదితరులు పాల్గొన్నారు. తొలుత శిలాఫలకాన్ని గొర్రెపాటి గోపీచంద్ ఆవిష్కరణ చేయగా కార్యాలయాన్ని బండి రామకృష్ణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.



# 14న గుడివాడ ఏఎన్నార్ కళాశాలలో జాబ్ మేళా

## యువత సద్వినియోగం చేసుకోవాలన్న ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, గుడివాడ ఎంఎల్ఏ వెనిగండ్ల రాము





**మచిలీపట్నం/ గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గాను ది.14.05.2025 బుధవారం ఉదయం 9 గంటలకు గుడివాడ "అక్కినేని నాగేశ్వరరావు (ఏయన్ఆర్) కళాశాల"లో "జాబ్ మేళా" నిర్వహించనున్నట్లు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, గుడివాడ నియోజకవర్గ శాసనసభ్యులు వెనిగండ్ల రాము కోరారు. ఈ జాబ్ మేళాలో హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, ఎమ్ఆర్ఎఫ్ లిమిటెడ్, ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్సు, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్, సుధీర్ టింబర్స్ ప్రైవేట్ లిమిటెడ్, కురాకు ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మెడ్ప్లస్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, పేటీఎమ్, వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్, సీయంఆర్ షాపింగ్ మాల్ తదితర ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని ఉపాధి అధికారి/డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డి. విక్టర్ బాబు, ఏపీయస్యస్డీసీ సంస్థ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్ తెలిపారు. ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.ఫార్మసి, పీజి పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు యువత అర్హులని, ఎంపిక అయిన వారికి ఆసక్తికర వేతనముతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కలవని, మే 14న నిర్వహించబోయే జాబ్ మేళాకు హాజరయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా సదరు ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి, తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in/user-registration లింక్‌లో తప్పనిసరిగా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయ్యి, సదరు జాబ్ మేళాకు రెజ్యూమ్ లతో లేదా బయోడేటా ఫారమ్ లతో పాటు ఆధార్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్, పాన్, సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 98488 19682, 96666 54641, 96767 08041 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి అధికారి/డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డి. విక్టర్ బాబు, ఏపీయస్యస్డీసీ సంస్థ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్ లు పాల్గొన్నారు.



## నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన ప్రసాద్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రసాద్ ఆదివారం స్థానిక నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులుగా ఎస్ ఎస్ఎన్ఎంవిఆర్ ప్రసాదును ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఉద్యోగులు, సహాయ అధ్యక్షులుగా ఎం ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా డి కుమార్, ఏ కోదండరమయ్య, కార్యదర్శులుగా ఎస్ రాము, సంయుక్త కార్యదర్శులుగా నాగలక్ష్మి, గోపికృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.కె జాబార్, కోశాధికారిగా ఎం నాగలక్ష్మిను ఏకగ్రీవం ఎన్నుకున్న సంఘ సభ్యులు ఎన్నికల అధికారిగా,వ్యవహరించిన ఆర్ శ్రీనివాస్, కే కొండయ్య

## డ్రైనేజీ మెరుగుపరిచి, నగరాన్ని అభివృద్ధి చేయడమే మంత్రి రవీంద్ర లక్ష్యం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** నగరాన్ని అభివృద్ధి చేసి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడమే మంత్రి కొల్లు రవీంద్ర లక్ష్యమని 45వ డివిజన్ ఇంచార్జి పీవీ ఫణి కుమార్ అన్నారు. నగర కార్పొరేషన్ 45వ డివిజన్‌లో సిడింబి అగ్రహారంలో పూడుకుపోయిన డ్రైనేజీని తవ్వించాలని స్థానిక ప్రజలు మంత్రి కొల్లు రవీంద్ర ను కోరగా, రవీంద్ర స్పందించి, వెంటనే చర్యలు తీసుకున్నారన్నారు. వారి సూచనల మేరకు ఆదివారం మున్సిపల్ జెసిబి తో ఫణి కుమార్ పర్యవేక్షణలో డ్రైనేజీను తవ్వించడం జరిగింది.సమస్యను పరిష్కరించినందుకు మంత్రి కొల్లు రవీంద్ర, కమిషనర్ బాపిరాజు కు డివిజన్ ప్రజల తరపున ఫణి కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. మురాల నాగేంద్రరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ ప్రతిభా పురస్కార వేడుకలు



**పామర్రు మే 11 మేజర్ న్యూస్ :** పామర్రు ఘంటసాల కళా పీఠం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ప్రతిభ పురస్కార వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. కడపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీతం, పాటలు పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బొడ్డు శ్రీనివాస్, స్థానిక ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, యుటిఎఫ్ కార్యదర్శి లంక నరేంద్ర, గౌరవ అధ్యక్షుడు కోటి పాండురంగారావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ముక్తేశ్వరరావు, బాపట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొని విద్యార్థులకు ఎన్టీఆర్ ప్రతిభ పురస్కార బహుమతులను అందించారు.



## ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలకు ప్రవేటు విద్యార్థులు

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** పాఠశాల విద్యార్థుల శాతాన్ని పెంచేందుకు వేసవి సెలవుల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. చల్లపల్లి నారాయణరావునగర్ మోడల్ పాఠశాల హెచ్ఎం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కైతేపల్లి దాస్, పాఠశాల ఉపాధ్యాయులు గత కొన్నిరోజులుగా ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే కలిగే ప్రయోజనాలు వివరిస్తూ, తమ మోడల్ పాఠశాలలోని సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు తెలియచేస్తూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రుల నుంచీ సానుకూలత వ్యక్తమవుతుండగా, ఆదివారం ప్రవేటు పాఠశాలల్లో చదువుతున్న ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను నారాయణరావు నగర్ మోడల్ పాఠశాలలో చేర్చేందుకు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకుమారి, విజయదుర్గ, రాధారాణి, పాగోలు దుర్గాప్రసాద్, అంగన్వాడీ కార్యకర్తలు ముంతాజ్బేగం, ఎస్ఎంసి సభ్యులు పాల్గొన్నారు.

## పులిగడ్డలో జంగిల్ క్లియరెన్స్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డలో పలు రహదారులు పంచాయతీ ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. గ్రామంలో పోలాశమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకొని పలు రహదారులలో ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు కొమ్మలను చెట్ల కొమ్మలను ఆదివారం సర్పంచ్ దాసరి విజయకుమార్ నేతృత్వంలో ప్రోక్లైన్ తొలగించారు. గ్రామస్తులు ఈ విషయాన్ని సర్పంచి విజయ్ కుమార్ సెక్రెటరీ బి అనితల అమ్మవారి జాతరను పురస్కరించుకొని రహదారులను శుభ్రం చేయడంలో కృషిచేసిన పంచాయతీ సర్పంచ్ కార్యదర్శి బి.అనితలను గ్రామస్తులు అభినందించారు.

## బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి పిలుపుమేరకు ఉగ్రవాదం నశించాలని కోరుతూ బిజెపి మండల పార్టీ అధ్యక్షురాలు బి విజయలక్ష్మి ఆధ్వర్యంలో వంతెన సెంటర్లోని ప్రసన్నాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు ప్రార్థనలు చేశారు. శనివారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో ఇటీవల జరిగిన కాశ్మీర్ పర్యాటకులను అమానుషంగా చంపేసిన ఉగ్రవాదులును తదనంతరం పాకిస్తాన్ ఉగ్రవాదులను తుదముట్టించిన భారతదేశం త్రివిధ దళాలు ప్రజలంతా క్షేమంగా ఉండాలని కోరుకుంటూ ఉగ్రవాదం నశించాలని, భారత దేశం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ,నియోజకవర్గ కో కన్వీనర్ తుంగల వెంకటగిరి, జాతీయ కౌన్సిల్ మెంబర్ గుండా బత్తిన నగరాయులు, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు, బోగాది చంద్రశేఖర్, నియోజకవర్గ నాయకులు భూపతి సుబ్రమణ్యం, అవనిగడ్డ మండల కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు మునగాల బాలకృష్ణ, చన్నగిరి లతా మోహన్,మోపిదేవి మండలం మాజీ అధ్యక్షులు కామిశెట్టి రమేష్ బాబు, కోడూరు మండల అధ్యక్షులు వడుగు నాగబాబు, ఆరోగ్య భారతి జిల్లా కన్వీనర్ గుడిసెవ విష్ణు ప్రసాద్, అల్లూరి శివ శ్రీనివాసరావు వేముల నరసింహారావు, మానేపల్లి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఘంటసాలలో బుద్ధ జయంతి వేడుకలకు హృదయపూర్వక స్వాగతం




**ఘంటసాల, మేజర్ న్యూస్:** బోధివృక్షం నీడన తపోదీక్ష ద్వారా తన హృదయంలో వెలిగిన జ్ఞానజ్యోతి కాంతుల్ని ప్రపంచానికి పంచాలనే సత్సంకల్పంతో ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభించిన గౌతమ బుద్ధుని జన్మదినం 'వైశాఖ పౌర్ణమి"! బుద్ధుని జననం, బోధి ప్రాప్తి, మహాపరినిర్వాణం అన్నీ ఈ పౌర్ణమినాడే సంభవించాయి. ఈ పవిత్రదినానికి అత్యున్నత ఆధ్యాత్మిక స్థానం అందుకే శ్రీలంక నుండి జపాన్ వరకూ, వియత్నాం నుండి టిబెట్ వరకూ ప్రపంచ శాంతిని కాంక్షించే ప్రజలందరూ సుదీర్ఘ ధ్యానాలతో, సూత్ర పఠనాలు, ధ్యానాలు, సత్సంగాలతో ఈ విశ్వశాంతి మహోత్సవాన్ని జరుపుకుంటారు. ఇది కేవలం బౌద్ధుల పండుగ కాదు. మానవతా మూల్యాలను ప్రపంచానికి బోధించిన భారతీయ తాత్విక సంప్రదాయానికి అంకితమైన పర్వదినం. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ ఘంటసాల గ్రామంలోని బౌద్ధస్తూపం ప్రాంగణంలో వివిధ కార్యక్రమాలతో పాటు శయన బుద్ధ ప్రాజెక్టు ఆవరణలో కృష్ణాజిల్లా రచయితల సంఘం గొర్రెపాటి ట్రస్ట్ సహకారంతో బౌద్ధ చారిత్రక సదస్సులు జరగనున్నాయి. దాదాపు 2,000 సంవత్సరాల కిందట ఆంధ్ర బౌద్ధ సంస్కృతికి ఆధారంగా నిలిచిన మహోన్నత బౌద్ధ క్షేత్రం ఘంటసాల. తూర్పుతీరంలోని ప్రముఖ బౌద్ధవిద్యాకేంద్రం ఇది. ఇక్కడ బుద్ధవిహారాలు, ఉపాసనా, ధ్యాన మందిరాలు ఉండేవి. శాతవాహన యుగంలో ఈ క్షేత్రం బౌద్ధధర్మాల్ని సుదూర దేశాలకు వ్యాపింప జేయడంలో కీలక పాత్ర వహించింది. శ్రీలంక, బర్మా, చైనా కొరియా వంటి దేశాలకు వెళ్ళిన బౌద్ధ ప్రబోధకులు ఇక్కడ శిక్షణ పొందారని పరిశోధనలు చెప్తున్నాయి. నాగార్జునకొండ, అమరావతి, భట్టిప్రోలు వంటి క్షేత్రాలతో కలిసి ఆంధ్ర బౌద్ధ మార్గదర్శకతకు ఘంటసాల ముఖ్యపాత్ర పోషించింది. రణనినాదాలతో భయభ్రాంతులకు లోనైన ప్రస్తుత ప్రపంచానికి బుద్ధుని శాంతిస్వరం అవసరం. ఈ పవిత్ర కార్యక్రమాలకు మీ అందరికీ హార్దిక స్వాగతం పలుకున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ బుద్ధ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్, సభాధ్యక్షులుగా అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, విశిష్ట అతిథులుగ రామ్మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి, శఈ మేరకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సంస్కృతి సమితి సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు పర్యవేక్షిస్తున్నారు.

# వైభవంగా అమ్మవారి జాతర మహోత్సవం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డలో వేంచేసి ఉన్న గ్రామ దేవత పోలాశమ్మ తల్లి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది భక్తులు నిర్వహించారు. జాతరలో భాగంగా రెండవ రోజైన ఆదివారం అమ్మవారి ఘటంమిందేలతో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు సమయంలో భక్తులు పసుపు కలిపిన నీళ్లను వారస పోసి పసుపు, కుంకుమ, పూలు, పళ్ళు సమర్పించి కర్పూర హారతులు ఇచ్చారు. రాత్రికి గుడి సంబరం సందర్భంగా ఆలయానికి ప్రవేశించిన అనంతరం అమ్మవారి ముగ్గు వేసి అమ్మవారి చరిత్ర తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో శ్రీ విజయ దుర్గ కోలాట సమాజం వారిచే కోలాట కార్యక్రమం నిర్వహించగా భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని కోలాట కార్యక్రమాన్ని తిలకించారు.

# బుద్ధ జయంతికి ఘంటసాల ముస్తాబు

**- తరలిరానున్న రాష్ట్ర మంత్రులు - ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్**





**ఘంటసాల, మేజర్ న్యూస్:** ప్రాచీన బౌద్ధ క్షేత్రం ఘంటసాల బుద్ధ జయంతికి ముస్తాబవుతోంది. ఈ నెల 12వ తేదీ సోమవారం ఘంటసాలలో జరిగే బుద్ధ జయంతి వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ సృజనాత్మకత సంస్కృతి సమితి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఘంటసాల గ్రామంలోని బౌద్ధస్తూపం ప్రాంగణంలో వివిధ కార్యక్రమాలతో పాటు శయన బుద్ధ ప్రాజెక్టు ఆవరణలో కృష్ణాజిల్లా రచయితల సంఘం, గొర్రెపాటి ట్రస్ట్ సహకారంతో బౌద్ధ చారిత్రక సదస్సులు, సాయంత్రం నాలుగు గంటలకు భారీ సాంస్కృతిక ర్యాలీ, బౌద్ధ స్థూపం వద్ద సభ జరగనున్నాయి. సాయంత్రం నాలుగు గంటలకు జరిగే ఈ బుద్ధ జయంతి వేడుకల ర్యాలీ, సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్, సభాధ్యక్షులుగా అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, విశిష్ట అతిథులుగా కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల శాఖామాత్యులు, కృష్ణాజిల్లా ఇంచార్జి మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర గనులు భూగర్భ శాస్త్ర, అబ్కారీ శాఖామాత్యులు కొల్లు రవీంద్ర, ఉమ్మడి కృష్ణా జిల్లా చైర్మన్ ఉప్పాల హారిక, మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ప్రభుత్వ విప్, గన్నవరం శాసన సభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, గౌరవ అతిథులుగా శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీలు టి.కల్పలత రెడ్డి, కొనకళ్ళ నారాయణరావు, ఆహ్వానితులుగా ఎంపీపీ వేమూరి రజని కుమారి, జడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఎంపీటీసీ దిరిశం వెంకటలక్ష్మి, సర్పంచ్ బాణావత్తు వెంకటేశ్వరమ్మ విచ్చేయనున్నారు. ఈ మేరకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సంస్కృతి సమితి సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, మండల అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే**

ఆదివారం సాయంత్రం ఈ వేడుకల ఏర్పాట్లను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జున్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, అధికారులు పర్యవేక్షించారు. శయన బుద్ధ విహార్ ప్రాజెక్టు, బౌద్ధ స్థూపంల వద్ద జరిగే సెమినార్లు, సభ ఏర్పాట్లు పరిశీలించారు. బౌద్ధ స్థూపం, మ్యూజియం వద్ద సభా వేదిక ఏర్పాట్లు పరిశీలించారు. రాష్ట్ర మంత్రుల రాక నేపథ్యంలో ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, డీసీ చైర్మన్ అయినంపూడి భానుప్రకాష్, ఎంపీడీఓ డీ.సుబ్బారావు, ఉపాధి పథకం ఏపీఓ రాజ్ కుమార్, నాయకులు, పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీ నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు



## శేష వాహనంపై గ్రామోత్సవం ప్రారంభించిన ఎమ్మెల్యే మండలి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డలో కొలువైయున్న శ్రీ భూనీళా రాజ్యలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీ నారాయణ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆలయ అనువంశిక ధర్మకర్త పోత రాజు భాస్కరరావు దాదాపు రూ.లక్ష వ్యయంతో స్వామివారికి సమకూర్చిన శేష వాహనంపై స్వామివారికి శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారి గ్రామోత్సవాన్ని ప్రారం భించారు. తొలుత స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా అర్చక స్వాములు దేవస్థానంలో నిత్యహోమం, బలిహరణం, నృసింహ జయంతి నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు, కుమార్తె - అల్లుడు శీలం కృష్ణప్రభ - అశ్విన్ కుమార్ దంపతులు కుటుంబ సమేతంగా విచ్చేసి శ్రీ లక్ష్మీ నారాయణ స్వామిని దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు), ఆలయ అనువంశిక ధర్మకర్త పోతరాజు భాస్కరరావు నేతృత్వంలో వారికి ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. స్వామివారి ఆశీస్సులు, వేద ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదం బహుకరించారు. అనంతరం ధర్మకర్తల స్వగృహములో స్నాతకపు కావడి, నిత్యహోమం, బలిహరణం, జగజ్జ్యోతి ప్రజ్వలనం, ఎదురుకోలు ఉత్సవం నిర్వహించారు. పోతరాజు పవన్ కుమార్ - సుమిత్ర దంపతులచే కళ్యాణ మహోత్సవము కన్నుల పండువగా నిర్వహించారు. అర్చక స్వాములు దీవి సారంగపాణి, బృందావనం అనంతరామాచార్యులు, దీవి వాసుదేవ సీతారామకృష్ణ, బృందావనం వేణుగోపాలాచార్యులు, రొంపిచర్ల భట్టార్ శత్రుఘ్నాచార్యులు, దీవి విజయ రాఘవ భట్టార్ ఆచార్యులు, దీవి అప్పలాచార్యులు, దీవి రఘునాథాచార్యులు, దీవి పార్థ వేంకట రామ శ్రీనివాసాచార్యులు, పాణింగిపల్లి దుర్గా రామ సత్య పవన్ కుమార్ ఆచార్యులు కార్యక్రమాలు నిర్వహించారు. శేషవాహనంపై స్వామివారి ఊరేగింపు లో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కొబ్బరికాయలు కానుకలు సమర్పించుకున్నారు.

# ద్వారకా తిరుమల వెంకన్న స్వామికి పట్టువస్త్రాలు సమర్పణ





**ఇంద్రకీలాద్రి, మేజర్ న్యూస్ :** చిన్న తిరుపతిగా పేరొందిన ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు సందర్భంగా విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నుండి పట్టువస్త్రాలు సమర్పించడమైనది. ఆలయ కార్యనిర్వాహణాధికారి, డిప్యూటీ కలెక్టర్ వి.కె.శీనానాయక్ దంపతులు,వేద పండితులు ఆదివారం సాయంత్రం స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యనిర్వాహణాధికారి దంపతులను ద్వారకా తిరుమల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎన్. వి. ఎస్. ఎన్. మూర్తి స్వాగతం పలికి, ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు లింగంబొట్ల దుర్గా ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

**'ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ'**

తేదీ. 12-05-2025న వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఉదయం 05.55 గం.లకు ఘాట్ రోడ్ ఎంట్రన్స్ వద్ద ఉన్న శ్రీ కామధేను అమ్మవారి ఆలయం నుండి 'ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ'కార్యక్రమం ప్రారంభమగును. ఘాట్ రోడ్ అమ్మవారి గుడి,కుమ్మరి పాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్త పేట, బ్రాహ్మణ వీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షిణ జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి. కె. శీనానాయక్ తెలిపారు. సకల అభీష్టములు నెరవేర్చే ఈ విశిష్ట కార్యక్రమంలో భక్తులంతా పాల్గొని శ్రీ దుర్గామల్లేశ్వరుల అనుగ్రహం పొందాలని భక్తులందరికీ ఇదే దేవస్థానం నుండి ఆహ్వానమని కార్యనిర్వహణాధికారి పేర్కొన్నారు.



# కేంద్ర హిందీ సలహా సంఘం సభ్యునిగా ఆచార్య యార్లగడ్డ



**విజయవాడ మేజర్ న్యూస్ :** కేంద్ర వైద్య మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న హిందీ సలహా సంఘం పునర్నిర్మాణానికి సంబంధించి కీలక నియామకాలు చోటు చేసుకున్నాయి. పద్మభూషణ్ పురస్కార గ్రహీత, సాహిత్య విమర్శకుడు, ప్రఖ్యాత రచయిత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఈ సంఘానికి సభ్యునిగా ఎంపికయ్యారు. హిందీ సలహా సంఘం కేంద్ర మంత్రిత్వ శాఖల హిందీ కార్యక్రమాల అమలును పర్యవేక్షిస్తూ, భాషా పరంగా సమతుల్యతకు దోహదపడే విధంగా పని చేస్తుంది. ఇందులో మొత్తం పదిహేడు మంది సభ్యులు ఉండగా, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాత్రమే దక్షిణ భారతదేశం నుంచి ఎంపిక కావటం ప్రాధాన్యతను సంతరించుకుంది. భాషా భిన్నతలు గల దేశంలో, దక్షిణాది రాష్ట్రాల హిందీ మద్దతుదారుల జ్ఞానం, అనుభవం కూడా కేంద్ర సంస్థల్లో ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. యార్లగడ్డ నియామకం ఈ కోణంలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంది. ఆచార్య యార్లగడ్డ హిందీ భాషా అభివృద్ధికి చేసిన కృషి సుపరిచితమే. అటు తెలుగులో, ఇటు హిందీలో అత్యున్నత ప్రతిభను ప్రదర్శించే సాహితీవేత్తగా ఆయనకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఆయన చేసిన సాహితీ సేవలకుగాను పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి అత్యున్నత పురస్కారాలు లభించాయి. ఈ నియామకం మూడేళ్ల కాలానికి వర్తిస్తుంది. ఈ వ్యవధిలో హిందీ పరిపాలనా వ్యవస్థలలో సమగ్రత, ప్రాంతీయ భాషలతో మైత్రి, హిందీ కార్యక్రమాలలో సమగ్ర మానవ వనరుల వినియోగానికి సంబంధించి యార్లగడ్డ సలహాలు దిశానిర్దేశకంగా పని చేయనున్నాయి. ఈ సంఘంలో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సభ్యత్వం దక్షిణాది రాష్ట్రాల మేధస్సుకు వచ్చిన గౌరవమే కాక, భాషా సమరసతకు దోహదపడే శుభ సంకేతంగా భావించవచ్చు.

## సెలవులు ప్రకటించిన ఏపీ హైకోర్ట్

**విజయవాడ మేజర్ న్యూస్ :** హైకోర్టుకు ఈ నెల 12 నుంచి జూన్ 13 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. తిరిగి జూన్ 16 నుంచి పూర్తిస్థాయి కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అత్యవసర వ్యాజ్యాల విచారణకు వెకేషన్ కోర్టులు ఏర్పాటు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. మొదటి దశ వెకేషన్ కోర్టులు ఈ నెల 15, 22, 29వ తేదీల్లో విచారణలు చేపడతాయి. ఇందులో భాగంగా మే 15, 22వ తేదీల్లో న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేష్ రెడ్డి, జస్టిస్ వై.లక్ష్మణరావు డివిజన్ బెంచ్‌గా జస్టిస్ చల్లా గుణరంజన్ సింగిల్ బెంచ్‌గా విచారణలు చేయనున్నారు. మే 29న జస్టిస్ ఎన్.హరినాథ్, జస్టిస్ వై.లక్ష్మణరావు డివిజన్ బెంచ్‌గా జస్టిస్ చల్లా గుణరంజన్ సింగిల్ బెంచ్‌గా కేసులు విచారించనున్నారు. రెండోదశ వెకేషన్ కోర్టులు జూన్ 5, 12వ తేదీల్లో విచారణ చేపడతాయి. జూన్ 5, 12వ తేదీల్లో జస్టిస్ జస్టిస్ ఎం.కిరణ్మయి, జస్టిస్ టి.సి.డి.శేఖర్ డివిజన్ బెంచ్, జస్టిస్ కుంచం మహేశ్వరరావు సింగిల్ బెంచ్ నిర్వహిస్తారు.

## తదుపరి ఆవిష్కరణలకు నాయకత్వం వహించాల్సిన సమయం వచ్చింది : సీఎం చంద్రబాబు

**నేడు టెక్నాలజీ డే**

**ఏపీలో టెక్నాలజీ భవిష్యత్తుపై సీఎం చంద్రబాబు స్పందన**

**ఆవిష్కరణ ప్రగతికి చోదకశక్తి అయితే, సాంకేతికత దానికి ఇంధనం అని వెల్లడి**

**విజయవాడ మేజర్ న్యూస్ :** అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని, రాష్ట్రంలో సమ్మిళిత, సుస్థిర భవిష్యత్తును నిర్మించేందుకు తమ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ఉందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తన సందేశాన్ని పంచుకున్నారు. "ఆవిష్కరణ ప్రగతికి చోదకశక్తి అయితే, సాంకేతికత దానికి ఇంధనం. జాతీయ సాంకేతిక దినోత్సవం నాడు, సుపరిపాలనలో ఆవిష్కరణల స్ఫూర్తిని, సాంకేతికత పరివర్తన శక్తిని మనం గౌరవించుకుంటున్నాం. వ్యవసాయ రంగం నుంచి కృత్రిమ మేధస్సు (ఏఐ) వరకు, సాంకేతికత ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందని, ఉత్పాదకతను గణనీయంగా పెంచుతోందని, మానవాళి ఎదుర్కొంటున్న క్లిష్టమైన సవాళ్లకు పరిష్కారాలను చూపుతోంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతిక పరివర్తనకు 'క్వాంటం వ్యాలీ'ని గుండెకాయగా అభివర్ణించిన చంద్రబాబు, "అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను సద్వినియోగం చేసుకుంటూ సమ్మిళిత, సుస్థిర భవిష్యత్తును నిర్మించడానికి మేము కట్టుబడి ఉన్నాం. ప్రపంచం భారతదేశం ఎదుగుదలను ఆసక్తిగా గమనిస్తోంది. ఇప్పుడు తదుపరి ఆవిష్కరణలకు నాయకత్వం వహించాల్సిన సమయం వచ్చింది" అని చంద్రబాబు తన సందేశంలో ఆశాభావం వ్యక్తం చేశారు.

**తల్లి కేవలం మొదటి గురువు మాత్రమే కాదు!**

అదేవిధంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు 'మాతృదినోత్సవం' సందర్భంగా కూడా ప్రత్యేక సందేశం ద్వారా తల్లులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. "తల్లి కేవలం మొదటి గురువే కాదు, ప్రతి ఇంటికి ఆమె ఒక హృదయ స్పందన, బలానికి మూలస్తంభం, తరతరాలకు మార్గనిర్దేశం చేసే శక్తి. పిల్లలలో విలువలను పెంపొందించడం మొదలుకొని దేశ నైతిక పునాదులు నిర్మించడం వరకు, తల్లి పాత్ర అసమానమైనది. ప్రతి తల్లి అపారమైన ప్రేమ, అసంఖ్యాక త్యాగాలు, మన కుటుంబాలకు, సమాజానికి, దేశానికి ఆమె అందిస్తున్న అజరామరమైన సేవలకు ప్రగాఢ కృతజ్ఞతలతో శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను" అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఉగ్ర వాదుల కార్యకలాపాల దృష్ట్యా , భద్రతా నియమావళిలో భాగంగా చల్లపల్లి పోలీసులు ఆర్టీసీ బస్టాండ్‌లో సోదలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ, అవనిగడ్డ డి.ఎస్.పి ఆదేశాల మేరకు చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ పీఎస్‌వి సుబ్రహ్మణ్యం తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగ్ లను తనిఖీ చేసి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ఈశ్వరరావు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు భద్రత కల్పించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్త వ్యక్తుల కదలికల పై జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# గ్రామీణ క్రీడాకారులకు చక్కటి సదావకాశం ఈ క్రికెట్ టోర్నమెంట్





**జమ్మవరం హైస్కూల్ మాజీ చైర్మన్ మంగళపూడి వెంకటేశ్వరరావు**

**కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీరులపాడు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్**

**మూడు రోజు పోటీపడ్డ ఆరు జట్లు**

**వీరులపాడు మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతంలోని క్రికెట్ క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి తీసుకువచ్చేందుకు మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్లు దోహదపడతాయి. కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) వీరులపాడు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసినందుకు జమ్మవరం హైస్కూల్ మాజీ చైర్మన్ మంగళపూడి వెంకటేశ్వరరావు ధన్యవాదములు తెలిపారు. జమ్మవరం గ్రామంలో జిల్లా పరిషత్ స్కూల్ గ్రౌండ్ లో జరుగుతున్న వీరులపాడు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో మూడు రోజు ఆదివారం మూడు మ్యాచులు జరిగాయి. ఈ మ్యాచులు వీక్షించేందుకు జమ్మవరం హైస్కూల్ మాజీ చైర్మన్ మంగళపూడి వెంకటేశ్వరరావు అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ లో మొత్తం 20 జట్లు పోటీ పడ్డాయని తెలిపారు. శుక్రవారం మూడు మ్యాచులు జరిగ్గా, శనివారం నాలుగు మ్యాచులు జరిగినట్లు తెలిపారు. అలాగే గ్రామాల పరిపూర్ణ వికాసం కోసం ఎంపీ కేశినేని శివనాథ్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత్ పంచాయతీ కార్యక్రమం కూడా ప్రజలకు బాగా ఉపయోగపడుతుందన్నారు. ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సలహాలు, సూచనలు,సహకారంతో పంచాయతీ చాంపియన్స్ గ్రామాల్లో ఉన్న నిరుద్యోగ యువత కు ఉద్యోగ ఉపాధి అవకాశాలు స్వయం ఉపాధి అవకాశాలు ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలు గురించి తెలియజేయటంతోపాటు గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ టోర్నమెంట్ మూడు రోజు జరిగిన మొదటి మ్యాచ్‌లో ఎమ్.ఎస్.కె యూత్ పోన్నవరం జట్టు పై కిషోర్ టీమ్ నందలూరు 12 పరుగుల తేడా విజయం అందుకుంది. ఇక రెండో మ్యాచ్‌లో ఎన్.ఎఫ్.సి యూత్ జుజ్జూరు జట్టు వెల్లంకి వారియర్స్ జట్టు పై 26 పరుగుల తేడాతో గెలిచింది. మూడో మ్యాచ్‌లో ఎ.ఎమ్.సి.సి 2 అల్లూరు జట్టు పై యువసేన ఓల్డ్ జమ్మవరం జట్టు 1 పరుగు తేడాతో విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఛాంపియన్స్ యర్రంరెడ్డి ప్రదీప్ కుమార్,కట్టా సునీల్, సింగి సురేష్,కొప్పుల రాము, ఆవులదొడ్డి హనుమంతరావు, కారం శీను, జమ్మవరం బోడవాడ గ్రామ నాయకులు క్రికెట్ అభిమానులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని క్రికెట్ మ్యాచులు వీక్షించారు.

# శ్రీకొండలమ్మకు పాలపొంగళ్ళు సమర్పించిన భక్తులు







**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో ఈ రోజు ఆదివారం సందర్భముగా అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారిని సుమారు 20,000 మంది భక్తులు దర్శించుకొనినారు. అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి, వారి యొక్క మొక్కు బడులు తీర్చుకొనినారు. శ్రీ అమ్మవారి దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు మజ్జిగ, త్రాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించినారు. శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనమునకు విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు, అవాంఛనీయ, సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ, వారి సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేసినారు. అని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు ఒక ప్రకటనలో తెలియజేసినారు.

# సచివాలయాల్లో పనిచేయని కంప్యూటర్లు ప్రింటర్స్





**జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలి**

**మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం నగర పరిధిలోని 50 సచివాలయాల్లో ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్లు పనిచేయకపోవడం వల్ల నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సచివాలయ సిబ్బంది వారికి వచ్చిన జీతంలోనే సొంత కంప్యూటర్ ఏర్పాటు చేసుకుని సచివాలయాన్ని కొనసాగించటం అత్యంత బాధాకరమని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అన్ని సచివాలయాల్లో తక్షణమే కంప్యూటర్లు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని నూతన కంప్యూటర్లు ఏర్పాటు చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు. కొత్తగా రేషన్ కార్డులు కుల ధ్రువీకరణ పత్రాలు విద్యుత్ బిల్లులు కొత్త ప్రాపర్టీ పన్ను దరఖాస్తులు వాటర్ కార్డులకు దరఖాస్తులు వంటి అనేక ప్రజా సంబంధిత దరఖాస్తులు కొరకు నగర ప్రజలకు సేవలు అందించవలసిన సచివాలయాలు కంప్యూటర్లు పనిచేయకపోవటం వలన ప్రజలకు సమాధానాలు చెప్పలేని పరిస్థితిలో ఉన్నాయి. మీసేవ కేంద్రంకి వెళితే దరఖాస్తుకు వంద రూపాయలు వసూలు చేయటం వలన ప్రజలకు ఇబ్బందులు కలగజేస్తుంది. అదే విధంగా సచివాలయంలో దినసరి కార్యక్రమాలకు కావలసిన వైట్ పేపర్లు ఇతర స్టేషనరీ కూడా అందజేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ పథకాల కోసం ఏ దరఖాస్తు పెట్టాలన్న సచివాలయం నుండి కంప్యూటర్లు పనిచేయడం లేదు మళ్లీ రండి అనే సమాధానం వస్తుంది. దీని వలన ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కారం చేయాలని లంకిశెట్టి బాలాజీ కోరారు.



# పదోన్నతులు కల్పించాలి

**ఉమెన్ హెల్త్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వికేఎన్ జయలక్ష్మి**

**విజయవాడ మేజర్ న్యూస్ :** క్షేత్రస్థాయిలో పనిచేయుచున్న ఆరోగ్య కార్యకర్తలు ఫేసు రికగ్నిజేషన్ స్కాన్తీ ఎఫ్ ఆర్ ఎస్ తీసివేయాలని, క్షేత్రస్థాయిలో 28 సంవత్సరముల నుండి ఆరోగ్య కార్యకర్తలు గా పనిచేయుచున్నారని, ఒకే క్యాడర్లో పదోన్నతులు లేకుండా ఎన్ని సంవత్సరాలు మెడికల్ ఆరోగ్య శాఖలో ఏఎన్ఎంలుగా ఏ పదోన్నతికి నోచుకోకుండా ఉన్నారు వారికి వెంటనే మల్టీ పర్పస్ ఎంతో సూపర్వైజర్స్ గా పదోన్నతులు కల్పించాలని ఉమెన్ హెల్త్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వికేఎన్ జయలక్ష్మి ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. ఆదివారం గాంధీనగర్ లోని ఎన్జీవో హోంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు 22 11 హెడ్ కింద పనిచేయుచున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఆడ, మల్టీపర్పస్ హెల్త్ సూపర్వైజర్స్ ఏ విధమైన రవాణా బచ్చుము గత ఐదు సంవత్సరాల నుంచి రావటం లేదు ఇవ్వవలసిందిగా కోరుతున్నామని అన్నారు. రీడ్ రిప్లై మెంట్ పేరుతో ఏఎన్ఎం లను క్యాన్సిల్ చేసి వెంటనే ట్రాన్స్ఫర్లు ఇవ్వవలసిందిగా కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో కృష్ణా జిల్లా సెక్రటరీ ప్రమీలా, యస్.వి.మహాలక్ష్మి, బి.విమల, కె.మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ చేసి బెదిరిస్తే వెంటనే ఫిర్యాదు చేయండి

**డీఎస్పీ సీ హెచ్.రాజా**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం సబ్ డివిజన్ పరిధిలో గడిచిన 10 రోజులుకాలంగా సైబర్ నేరగాళ్లు తాము సిబిఐ, కస్టమ్స్, నార్కోటిక్స్, స్పెషల్ సెల్ మొదలైన ప్రభుత్వ సంస్థలకు చెందిన అధికారులమని ఫోన్ చేయడం, మీపై కేసు నమోదు అయినదని దర్యాప్తు పేరుతో వీడియో కాల్స్ లో భయభ్రాంతులకు గురి చేయడం, స్కాంకు సంబంధించిన డబ్బులు మీ అకౌంట్లో డిపాజిట్ అయినవి వాటిని వెరిఫై చేయాలి అని చెప్పి బెదిరించడం వంటి నేరాలకు పాల్పడి, 5 మంది వేరువేరు వ్యక్తుల నుండి సుమారు 1 కోటి రూపాయల వరకు సైబర్ నేరానికి పాల్పడడం జరిగింది.ఈ నేరాలన్నీ ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చెందిన సీనియర్ సిటిజన్లను టార్గెట్ చేసి మీరు అరెస్ట్ లో ఉన్నారు కేసు నమోదు అయిందని భయపెట్టి, బెదిరించి డబ్బులు కాజేస్తున్నారు.కావున ఇలా మిమ్మల్ని బెదిరించడానికి వచ్చే డిజిటల్ అరెస్ట్ కాల్స్ ని నమ్మవద్దు. డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలోనే లేదు, అది కేవలం సైబర్ నేరగాళ్ల మోసపూరితమైన చర్య. ఇలా ఎవరైనా మీకు ఫోన్ చేసి బెదిరిస్తున్నట్లయితే వెంటనే పోలీసు వారికి ఫిర్యాదు చేయవచ్చని అని డీఎస్పీ సీ హెచ్ రాజా తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు మచిలీపట్నం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ నెంబర్ 9440796405 సంప్రదించవచ్చని అన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999